క్లుప్తంగా

ఘనంగా కేజీ గ్రాడ్యుయేషన్ డే



గన్నవరం: స్థానిక వీఎస్ సెయింట్‌జాన్స్ మాధ్యమికోన్నత పాఠశాలలో సోమవారం కేజీ గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గన్నవరం సీఐ బీవీ శివప్రసాద్ మాట్లాడుతూ.. పిల్లల చదువుల పట్ల ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని చెప్పారు. పిల్లలను సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచాలని సూచించారు. అనంతరం యూకేజీ పూర్తిచేసిన చిన్నారులకు సీఐ, ప్రిన్సిపాల్ బ్రదర్ సంతోష్‌కుమార్, ఎస్ఐ శివప్రసాద్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. చిన్నారులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సీనియర్ బ్రదర్ జిమ్మీ కురియోకోస్, బ్రదర్ భల్లా జోసఫ్, బ్రదర్ జయబాలన్, కేజీ కోఆర్డినేటర్ యేకాంబరి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రైతు దేశానికి వెన్నెముక



ఉయ్యూరు: రైతే దేశానికి వెన్నెముక అని గన్నవరం ఏడీఏ సునీల్‌కుమార్ పేర్కొన్నారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ ఉయ్యూరు ఆధ్వర్యంలో జాతీయ రైతు దినోత్సవ వేడుకలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ రైతు దినోత్సవ ఆవశ్యకత, రైతుల ప్రాముఖ్యత ఏడీఏ సునీల్ వివరించారు. పలువురు రైతులను ఘనంగా సత్కరించారు. లయన్స్ ప్రతినిధి నల్లా శ్రీనివాస్ రైతాంగానికి ఉపయోగపడే కిట్లను అందించారు. ఏఓ నిస్సి గ్రేస్, లయన్స్ ప్రతినిధులు నేరెళ్ల తేజ, రావులపల్లి సుధాకర్, నెల్లి రాంబాబు, దీనవహి ప్రసాద్ పాల్గొన్నారు. ఏజీఅండ్ఎస్‌జీ సిద్దార్థ కళాశాలలో వృక్షశాస్త్రం విభాగం ఆధ్వర్యాన రైతు దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శివనాథ్, ప్రత్యేక అధికారి సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు



కంకిపాడు: సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ ఎ.శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని కోలవెన్ను గ్రామంలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గ్రామానికి చెందిన పలువురు భూ సమస్యలపై అర్జీలు సమర్పించారు. డిప్యూటీ తహసీల్దార్ మాట్లాడుతూ అర్జీలను పూర్తి స్థాయిలో పరిశీలించి త్వరితగతిన సమస్యలను పరిష్కరించేలా చర్యలు చేపడతామన్నారు. సర్పంచ్ సీహెచ్ సురేష్, ఈఓ శ్రీనివాసరావు, వీఆర్ఓ మల్లికార్జునరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఏమైంది

ఉంగుటూరు: పేదలకు పంపిణీ చేయాలని తీర్మానించిన భూమి ఏమైందని సీపీఎం మండల పార్టీ కార్యదర్శి అజ్మీర వెంకటేశ్వరరావు అధికారులను ప్రశ్నించారు. ఉంగుటూరు, ఎలుకపాడు, పాణుకుమాడు గ్రామాల్లో సోమవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎలుకపాడు గ్రామంలో సర్వేనంబరు 86/1సీ1, 86/సీ2లో మొత్తం మూడు ఎకరాల భూమిని ప్రభుత్వం 2009లో 30 పేద కుటుంబాలకు పంపిణీ చేయాలని నాటి స్థానిక ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఎస్సైన్‌మెంట్ కమిటీ తీర్మానం చేసిందని తెలిపారు. ఆ భూమిని పేదలకు పంచాలని కోరుతూ రెవెన్యూ సదస్సులో సీపీఎం ఆధ్వర్యంలో గ్రామస్తులు తహసీల్దారు జె.విమలకుమారికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీరామ్ (నాని), వీఆర్ఓ రామారావు పాల్గొన్నారు.

వృద్ధులకు చీరల పంపిణీ



గన్నవరం: వృద్ధులు, వితంతువుల సంక్షేమానికి ప్రతి ఒక్కరూ తమవంతు తోడ్పాటు నందించాలని బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు తిరివీధి వెంకయ్య సూచించారు. స్థానిక రాయ్‌నగర్‌లో సోమవారం క్రిస్మస్ సందర్భంగా తిరివీధి వెంకయ్య, రాణి దంపతులు వంద మంది వృద్ధులు, వితంతువులకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీస్తు మార్గం ప్రపంచ మానవాళికి అనుసరణీయమని చెప్పారు. ఆయన బోధనలకు అనుగుణంగా ప్రేమ, దయ, కరుణ వంటి సద్గుణాలను కలిగి ఉండాలని పేర్కొన్నారు. తొలుత క్రిస్మస్ కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కాలనీ పెద్దలు జున్ను నారాయణ, ఓలేటి శాంతికుమార్, తల్లి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షురాలు రాచేటి రూతమ్మ తదితరులు పాల్గొన్నారు.

సంపదపై చెత్తశుద్ధి లేదు

- అలంకారప్రాయంగా చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాలు
- పట్టించుకోని అధికారులు



నున్న గ్రామంలో ఖాళీగా ఉన్న కేంద్రం

విజయవాడ రూరల్: కూటమి ప్రభుత్వంలో చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాలు మూలనపడ్డాయి. గ్రామాల్లో చెత్తను సేకరించి తడి, పొడి చెత్తను వేరు చేసి వాటి నుంచి సేంద్రియ ఎరువులను తయారు చేసి విక్రయించడం ద్వారా సంపదను సృష్టించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన కేంద్రాలు అలంకారప్రాయంగా ఉన్నాయి. విజయవాడ రూరల్ మండలంలో కొత్తగా ఏర్పడిన రామరాజ్యనగర్, జక్కంపూడి కాలనీతో కలిపి 16 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వాటిల్లో పది గ్రామాల్లో మాత్రమే చెత్త సంపద కేంద్రాలున్నాయి. వాటిలో చెత్తను సేకరించి వర్మీ కంపోస్టు ఎరువులను తయారు చేయడానికి అవసరమైన పిట్స్ నిర్మాణం జరగలేదు. చెత్త సంపద కేంద్రాలను సమర్థవంతంగా పని చేసేలా చర్యలు తీసుకోవాలని అవసరమైన గ్రామాల్లో 15వ ఆర్థిక సంఘం నిధులు ఖర్చు చేయాలని కేంద్ర ప్రభుత్వం సూచించినా ఇంత వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. గ్రామాల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో చెత్త సేకరణ కోసం ఏర్పాటు చేసిన వాహనాలు ఇంటింటా తిరిగి చెత్త సేకరిస్తున్నప్పటికీ ఎరువుల తయారీ మాత్రం జరగడంలేదు. విజయవాడ రూరల్ మండలంలోని నున్న, పాతపాడు గ్రామాల్లో మాత్రమే వర్మీ కంపోస్టు ఎరువులు తయారీ చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. సంపద సృష్టించే కేంద్రాల్లో కనీసం సేకరించిన చెత్త కూడా లేదు. అలాంటప్పుడు తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి సంపదను ఎలా సృష్టిస్తామని పంచాయతీ కార్యదర్శులు అంటున్నారు.



నిరుపయోగంగా ఉన్న పిట్స్

ఆశించిన ఫలితాలు శూన్యం

గొల్లపూడి, రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు గ్రామాల్లో చెత్త సంపద కేంద్రాలు ఏర్పాటు చేయడానికి అవసరమైన స్థలాలు లేక అసలు కేంద్రాలనే నెలకొల్పలేదు. మిగిలిన పది గ్రామాల్లో చెత్త సంపద కేంద్రాలున్నా కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అవి అలంకారప్రాయంగా పడి ఉన్నాయి. చెత్త సంపద కేంద్రాల నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు కేటాయించే 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి పది లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నా, ఆశించిన ఫలితాలు మాత్రం కనిపించడం లేదు. చెత్త సేకరించి ఎరువులు తయారు చేయడానికి ప్రతి వెయ్యి మంది జనాభాకు ఒక క్లాప్‌మిత్రను నియమించారు. విజయవాడ రూరల్ మండలంలో సుమారు 220 మంది క్లాప్ మిత్రలు పని చేస్తున్నారు. కాగా వారు కేవలం గ్రామ పంచాయతీల్లో డ్రెయినేజీ కాల్వలు తీయడం లాంటి పనులు చేస్తున్నారు. ప్రభుత్వం చెబుతున్న విధంగా సంపదను మాత్రం సృష్టించలేకపోతున్నారు. ప్రభుత్వం ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా మండల, గ్రామ పంచాయతీల ప్రజాప్రతినిధులకు, ఉద్యోగులకు సుస్థిర లక్ష్యాల అభివృద్ధి సాధన దిశగా శిక్షణ తరగతులు నిర్వహించినా అవి మొక్కుబడిగా జరిగాయి. ప్రభుత్వం ఆశించిన మేరకు ప్రజాప్రతినిధులు శిక్షణకు హాజరుకాలేదు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న గ్రాంటుల నుంచి స్వచ్ఛ భారత్‌కు వినియోగించాలని.. వర్మీ కంపోస్టు ఎరువుల తయారీకి తప్పనిసరిగా నిధులను కేటాయించాలని చెప్పినా ఇంత వరకు ఒక్క పంచాయతీ కూడా తీర్మానం చేసిన దాఖలాలు లేవు.



మూలనపడిన అంబాపురంలోని తడి, పొడి చెత్త వేరు చేసే కేంద్రం

ఎక్కడ చూసినా చెత్త కుప్పలే



అంబాపురం గ్రామం ఒకటో వార్డులో ఎక్కడ చెత్త అక్కడే పేరుకు పోతుంది. పంచాయతీ చెత్తను సేకరించడంలో విఫలం అయ్యింది. రోడ్ల పైన ఎక్కడ చూసినా చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి.

–దోలా భవానీ, అంబాపురం గ్రామం

చర్యలు తీసుకుంటాం



రూరల్ మండలంలో చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాలు పని చేయడం ఇటీవల మందగించాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ వారం నుంచి చురుగ్గా పని చేసేలా చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

–ఎంపీడీ ప్రసాద్, ఈఓఆర్డీ, విజయవాడ రూరల్

ఉప్పలూరులో వైఎస్సార్ సీపీ బ్యానరు చించివేత



కంకిపాడు: మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బ్యానరును కొందరు గుర్తు తెలియని వ్యక్తులు చించివేశారు. ఉప్పలూరు గ్రామంలోని ప్రధాన సెంటరులో ఈనెల 21వ తేదీన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా వైఎస్సార్ సీపీ శ్రేణులు బ్యానరు ఏర్పాటు చేశారు. అయితే సోమవారం గుర్తుతెలియని వ్యక్తులు బ్యానరు చించివేశారు. గ్రామంలో రాజకీయపరమైన కక్షలను రెచ్చగొట్టేలా కొందరు వ్యక్తులు వ్యవహరిస్తున్నారని, ఈ చర్యను సహించేది లేదని వైఎస్సార్ సీపీ నేతలు స్పష్టంచేశారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ఉయ్యూరు: పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యంగా జీవించవచ్చని ఎంపీడీఓ శేషగిరిరావు అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో స్థానిక ఏజీఅండ్ఎస్‌జీ సిద్దార్థ కళాశాలలో సోమవారం కిషోర వికాసం మండల స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ అనంతరం కిషోర వికాసంపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శేషగిరిరావు మాట్లాడుతూ బాలికా విద్య, సంపూర్ణ ఆరోగ్యం, బాల్య వివాహాలు, లైంగిక వేధింపులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి బేబి సుకన్య మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. మహిళాసాధికారితపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ సుధారాణి, పీహెచ్‌సీ వైద్యులు ఇంద్రావతి, గోపిచంద్, న్యాయవాది శైలజ, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ పోరుబాట పోస్టర్ ఆవిష్కరణ



గన్నవరంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

గన్నవరం: విద్యుత్ ఛార్జీల బాదుడుపై ఈ నెల 27వ తేదీన చేపట్టనున్న వైఎస్సార్ సీపీ పోరుబాటను జయప్రదం చేయాలని ఆ పార్టీ నేతలు పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం పోరుబాట పోస్టర్‌ను జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి, విజయవాడ రూరల్ పార్టీ అధ్యక్షుడు, నిడమానూరు సర్పంచ్ శీలం రంగారావు, నేతలు సూరం విజయ్‌కుమార్, సూరెడ్డి మణిమ్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ ఛార్జీలు పెంచమని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం విస్మరించిందన్నారు. సర్దుబాటు ఛార్జీల పేరుతో ప్రజలపై వేల కోట్ల రూపాయిలు విద్యుత్ భారం వేయడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వం గృహ వినియోగదారులపై మోపిన రూ. 15,485.36 కోట్ల ఛార్జీల బాదుడును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కొనసాగించాలని కోరారు. వీటిపై ఈ నెల 27న ర్యాలీగా వెళ్లి గన్నవరం సబ్‌స్టేషన్ వద్ద ప్రజల తరుపున నిరసన తెలిపి, వినతి పత్రం సమర్పించనున్నట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ నేతలు ధర్మారావు, వంశీకృష్ణ, ప్రభాకర్, శివ, పులిమద్ది మహబూబ్‌బీ, ఈద పద్మ, రజని తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో సవాళ్లు అధిగమించాలి



శిక్షణ తరగతులు ప్రారంభించిన వెంకటకృష్ణ

పెనమలూరు: పరిశ్రమల్లో ఎదురయ్యే సవాళ్లను విద్యార్థులు అధిగమించాలని విజయవాడ సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్ (సీఐటీడీ) డెప్యూటీ డైరెక్టర్ ఎస్.వెంకటకృష్ణ అన్నారు. గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో సోమవారం ఆయన ఆరు వారాల పాటు జరిగే నైపుణ్యాభివృద్ధి శిక్షణ తరగతులను ప్రారంభించి ప్రసంగించారు. పరిశ్రమల్లో విద్యార్థులు తమ నైపుణ్యం చూపడానికి ఈ శిక్షణ తరగతులు ఉపయోగపడతాయని తెలిపారు. ప్రధానంగా పరిశ్రమల్లో జీ కోడ్–ఎం కోడ్ రియల్ టైమ్ మిషన్ అప్లికేషన్ తదితర అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు. విద్యార్థులు విలువైన శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకొని నైపుణ్యం సాధించాలని సూచించారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కడియాల రవి, మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ శివతేజ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు



ముస్తాబాద నవభారత్ హైస్కూల్‌లో సెమీ క్రిస్మస్ వేడుకల్లో విద్యార్థులు, యాజమాన్యం



కానూరులో క్రిస్మస్ వేడుకల్లో చిన్నారులు

గన్నవరం రూరల్: ప్రపంచానికి క్రీస్తు మార్గం అనుసరణీయమని బ్రదర్ జాన్ పాల్ పేర్కొన్నారు. మండలంలోని ముస్తాబాద నవభారత్ హైస్కూల్‌లో సోమవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ షేక్ ఇమాం మాట్లాడుతూ మానవాళిని పాపాల నుంచి రక్షించేందుకు క్రీస్తు ప్రభువు లోకానికి వచ్చారని పేర్కొన్నారు. విద్యార్థులు క్రిస్మస్ వేషధారణలతో అలరించి శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ప్రిన్సిపాల్ జాకీరా సుల్తానా, ఉపాధ్యాయులు అశోక్ రాణి, షేక్ హసీనా, సునీత విజయలక్ష్మి, జయశ్రీ, షేక్ కౌసర్ పాల్గొన్నారు.

ఎనికేపాడులో...

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ఎనికేపాడు శివాలయం వీధిలో షాలోం ఇవాంజిలికల్ ఫెలోషిప్ ఆధ్వర్యాన సెమీ క్రిస్మస్ వేడుకలను ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు హాజరై కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పేదలకు నిత్యావసర వస్తువులు, దుప్పట్లు పంపిణీ చేశారు. పాస్టర్ తుమ్మల సత్యం, సర్నాల బాలాజీ, పాదిలి దుర్గారావు, కోనేరు సందీప్ పాల్గొన్నారు.

పెనమలూరు: కానూరు కార్మెల్‌మాత పుణ్యక్షేత్రంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా చేశారు. ఫాదర్ సలివేంద్ర శౌరి ఆదివారం రాత్రి క్రిస్మస్ వేడుకలు భక్తిశ్రద్ధలతో చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సీటీసీ సిస్టర్స్, ఉపదేశకులు, దళ సభ్యులు, సహాయ గురువులు ఫాదర్ దేవదానం, ఫాదర్ రత్నరాజు, భక్తులు పాల్గొన్నారు.



విద్యుత్ దీపాలంకరణలో కానూరు కార్మెల్‌మాత చర్చి



పోరంకి బీజేఆర్ నగర్‌లో క్రిస్మస్ స్టార్

మొదలైన క్రిస్మస్ సందడి

పెనమలూరు మండలంలో క్రిస్మస్ సందడి మొదలైంది. భక్తులు గ్రామాల్లో ఏసు జన్మదినం సూచించే విధంగా క్రిస్మస్ స్టార్లు పెట్టారు. రాత్రి సమయాల్లో క్రిస్మస్ స్టార్లు వెలుగులు విరజిమ్ముతున్నాయి. ఆయా గ్రామాల్లో చర్చిలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు.

–పెనమలూరు

హుండీ ఆదాయం రూ. 11.49 లక్షలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయస్వామి దేవస్థానం హుండీ ఆదాయం రూ. 11.49 లక్షలు వచ్చినట్లు ఆలయ ఈఓ కూచిపూడి శ్రీనివాస్ తెలిపారు. ఆలయ సమీపంలోని ధర్మసత్రంలో సోమవారం హుండీ ఆదాయం లెక్కింపు జరిగింది. గత 96 రోజులకు గానూ రూ. 11,49,981 వచ్చినట్లు ఆయన చెప్పారు. దేవదాయ శాఖ ఏలూరు ఇన్‌స్పెక్టర్ వి.సురేష్‌కుమార్ పర్యవేక్షణలో హుండీ ఆదాయం లెక్కింపు జరిగింది. ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు లెక్కింపులో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అనఘాష్టమి వ్రతం



గండిగుంట దత్త దేవాలయంలో అనఘాదేవికి పూజలు చేస్తున్న భక్తులు

ఉయ్యూరు: మండలంలోని గండిగుంట దత్త దేవాలయంలో సోమవారం అనఘాష్టమి వ్రత పూజా కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 108 కలశాలతో విశేష పూజలు జరిపించారు. అనంతరం 300 మంది భక్తులకు అన్నసంతర్పణ చేశారు. పూజా కార్యక్రమాలను ఆలయ మేనేజింగ్ ట్రస్టీ మంజుల పర్యవేక్షించారు.

కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లి శివారు శ్రీదత్తాశ్రమంలోని శ్రీపంచతత్వ గురు పాదుక మందిరంలో సోమవారం ప్రథమ అనఘాష్టమి వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని శాస్త్రోక్తంగా వ్రతాన్ని నిర్వహించారు. అనంతరం ఆశ్రమ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నసంతర్పణ చేశారు.

విద్యార్థులకు భోజనం ప్లేట్లు అందజేత

కంకిపాడు: వసతులను సద్వినియోగం చేసుకుని చదువుల్లో రాణించాలని వక్తలు కోరారు. జంపాన వెంకటరత్నం, జంపాన వీరరాఘవయ్య చారిటబుల్ ట్రస్టు సహకారంతో ఉప్పలూరులోని ప్రాథమిక పాఠశాలలో 150 మంది విద్యార్థులకు సోమవారం భోజనం ప్లేట్లు పంపిణీ చేశారు. జంపాన వీరరాఘవయ్య కుమారుడు సుధాకర్, ఆయన సోదరి అమరజ్యోతి స్థానికులు అన్నే ధనయ్య, చలసాని రాధాకృష్ణ, కొణతం సుబ్రహ్మణ్యం, కొండవీటి శివయ్య విద్యార్థులకు ప్లేట్లు అందజేశారు. కార్యక్రమంలో పడవల మధుసూదన్ రావు, శనగశెట్టి హరికృష్ణ, జంపాన వీరాస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యాజమాన్య చర్యలతో ఉద్యాన పంటలకు జీవం



కంకిపాడు: యాజమాన్య చర్యలతో ఉద్యాన పంటలకు జీవం లభిస్తుందని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ వి.మంజువాణి అన్నారు. మండలంలోని మద్దూరు, కాసరనేనివారిపాలెం గ్రామాల్లో ఉద్యానశాఖ అధికారులతో కలిసి ఆమె పర్యటించారు. అరటి, పసుపు, మిరప, తమలపాకు తోటలను సందర్శించారు. పసుపు తోటల్లో దుంప/వేరుకుళ్ల తెగులు, మిరపలో నల్లతామర పురుగు సమస్య, అరటిలో సిగటోక ఆకుమచ్చ తెగులు ఉండటం గుర్తించారు. మొక్కల చుట్టూ నీరు నిలిచి ఉండటంతో దుంప/వేరు కుళ్ల తెగులు ఆశిస్తుందన్నారు. లీటరు నీటికి మూడు గ్రాములు మెటలాక్సిల్, లేదా బ్లైటాక్స్ మొక్కల మొదళ్లలో పోసుకోవడం ద్వారా తెగులును నివారించుకోవచ్చన్నారు. అరటిలో కనిపించే సిగటోక ఆకుమచ్చ తెగులు నివారణకు ప్రొపికొనజోల్ ఒక మిల్లీలీటరు లీటరు నీటికి కలిపి 2–3 సార్లు 20 రోజుల వ్యవధిలో పిచికారీ చేసుకోవాలని చెప్పారు. యాజమాన్య చర్యలు సమర్థంగా తీసుకోవాలని సూచించారు. కంకిపాడు ఉద్యానశాఖ అధికారి చందు జోసఫ్ సుందరం పాల్గొన్నారు.

రోడ్డు మార్జిన్లు డొల్ల

- నిబంధనలకు విరుద్ధంగా నల్లమట్టితో మార్జిన్లు
- పెదవి విరుస్తున్న గంగూరు గ్రామస్తులు

పెనమలూరు: ఇటీవల సీఎం చంద్రబాబు పర్యటన కారణంగా గంగూరు రోడ్డు ఆగమేఘాలపై నిర్మాణం చేశారు. అయితే రోడ్డు మార్జిన్లు చెరువు కట్ట మట్టితో వేయడంతో గ్రామస్తులు అభ్యంతరం తెలుపుతున్నారు. వివరాల్లోకి వెళితే.. గత రెండు రోజుల క్రితం సీఎం చంద్రబాబునాయుడు గంగూరులో రైతుసేవా కేంద్రం, రైస్‌మిల్లు పరిశీలించడానికి వచ్చారు. ఆయన రాక సందర్భంగా బందరు రోడ్డు నుంచి గంగూరు గ్రామంలోకి ఉన్న 1.6 కిలో మీటర్ల రోడ్డును ఉపాధి నిధులు రూ. 35 లక్షలతో ఆగమేఘాలపై నిర్మించారు. సీఎం పర్యటన చేసిన ప్రాంతం రోడ్డును రైతుసేవా కేంద్రం వరకు ప్రధాన రోడ్డు నిర్మాణం మాత్రం పూర్తి చేశారు. మిగితా రోడ్డు కంకర వేశారు. ఇంకా రోడ్డు పనులు తారు వేసి పూర్తి చేయాల్సి ఉంది. అయితే నిబంధనలకు విరుద్ధంగా గ్రామ చెరువు కట్ట నల్లమట్టి తవ్వి తీసుకువచ్చి రోడ్డు మార్జిన్లలో వేశారు. వాస్తవానికి గ్రావెల్ తీసుకువచ్చి రోడ్డు మార్జిన్లలో వేయాల్సి ఉంది. అసలే చెరువు కట్ట అంతంత మాత్రంగా ఉండగా కట్ట తవ్వి ఆ మట్టి రోడ్డుకు వేయడం పట్ల గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై డీఈ శ్రీనివాస్‌ను వివరణ కోరగా రోడ్డు మార్జిన్‌ల్లో నల్లమట్టి తొలగించి గ్రావెల్‌తోనే వేస్తామని, నాణ్యతతో రోడ్డు పనులు పూర్తి చేస్తామని పేర్కొన్నారు.



గంగూరు రోడ్డు పక్కన వేసిన చెరువు కట్ట నల్లమట్టి



చెరువు కట్ట మట్టి తవ్విన ప్రదేశం

హెల్త్ అసిస్టెంట్లను విధుల్లోకి తీసుకోవాలి



వీరవల్లిలో హెల్త్ అసిస్టెంట్లకు మద్దతు తెలుపుతున్న పీహెచ్‌సీ ఉద్యోగులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: వైద్య, ఆరోగ్య శాఖలో ఉద్యోగాలు కోల్పోయిన హెల్త్ అసిస్టెంట్లకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, ఇతర సిబ్బంది సంఘీభావం తెలిపారు. బాపులపాడు మండలం వీరవల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్లు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. పీహెచ్‌సీ డాక్టర్లు, సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు వీరికి మద్దతు తెలిపారు. తక్షణమే హెల్త్ అసిస్టెంట్లను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. హెల్త్ అసిస్టెంట్ల సంఘం నాయకులు తొమ్మండ్రు పండు, గుండుగొలను నాగరాజు, కందుకూరి వేణుగోపాలాచారి, శివాజీ పాల్గొన్నారు.

విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలి



హనుమాన్‌జంక్షన్ రూరల్: చదువుతో పాటుగా క్రీడల్లోనూ విద్యార్థులను ప్రోత్సహించాలని హనుమాన్‌జంక్షన్ సీఐ కేవీవీఎస్ సత్యనారాయణ అన్నారు. బాపులపాడు మండలం వేలేరులోని జవహర్ నవోదయ విద్యాలయంలో సోమవారం జరిగిన వార్షిక క్రీడోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. బాల, బాలికలకు 100, 400 మీటర్ల పరుగు పందెం, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ ఆటల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు సీఐ సత్యనారాయణ చేతుల మీదుగా ట్రోఫీలు, సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.